ముున్సిపల్‌లో నిలిచిపోయిన సేవలు

- పన్నుల వసూళ్లలో అధికారులు బిజీ
- మహిళా ఆర్పీలనూ వదలని వైనం
- 45శాతంకు చేరిన కలెక్షన్

జయశంకర్ భూపాలపల్లి. ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయం నిర్మానుష్యంగా మారింది. కార్యాలయంలో కమిషనర్ మినహా అధికారులు, సిబ్బంది ఎవరూ కనిపించడం లేదు. ప్రతి ఒక్కరూ ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో నిమగ్నమయ్యారు. చివరికి మెప్మాకు చెందిన ఆర్పీలు సైతం పన్నుల వసూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. మున్సిపల్ సిబ్బందినంతా ఏడాది పొడవునా ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించుకున్న అధికారులు చివరికి ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉన్నామని హడావిడిగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. 20రోజులుగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చెమటోడ్చి 26.92 శాతం నుంచి 45శాతంకు పన్నుల వసూలు తీసుకువచ్చారు. మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో పన్నుల వసూళ్లలో ఉండడంతో ఆయా అవసరాలకు కార్యాలయానికి వచ్చే ప్రజలు 20 రోజులుగా వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. మరో నెల రోజులపాటు ప్రజలకు ఈ తిప్పలు తప్పేలా లేదు.

26.92 శాతం నుంచి45శాతానికి

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 1వరకు 26.92శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. మొత్తం రూ.7.31కోట్లు ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 45శాతం వసూలైంది. సింగరేణి సంస్థకు సంబంధించి రూ.2.58కోట్ల బకాయిలు అలాగే ఉన్నాయి. ఈ విషయమై జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉన్నారు. మొత్తం మీద మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వార్డు సభలు, ప్రజాపాలన వారోత్సవాలు, సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వే, నాలుగు పథకాల వార్డు సభలు, ఇలా సిబ్బందిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంతో ప్రస్తుతం పన్నుల వసూలు భారమంతా అధికారులు, సిబ్బంది భుజానవేసుకుని స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్న అధికారులు

మార్చి 31లోగా వందశాతం పన్నులు వసూలు చేయాలి

భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 19 : మార్చి 31వ తేదీలోగా వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కార్యాలయపు రెవెన్యూ సూపర్‌వైజర్లు, సిబ్బందితో మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఇంటి పన్నులు, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 45శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయని, వందశాతం వసూలు చేసి టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయంలోని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పీఏసీఎస్‌లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

తాడ్వాయి, ఫిబ్రవరి 19 : మండలకేంద్రంలోని సహకార సంఘంలో అవినీతి జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇందారపు లాలయ్య ఆరోపించారు. మండలంలోని కాటాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల కోసం సరఫరా చేస్తున్న ఎరువులను రైతులకు అందించకుండా నేరుగా ఫర్టిలైజర్ షాపులకు అమ్ముకుంటన్నారని ఆరోపించారు. గత సంవత్సరం రూ.80లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ బిల్డింగ్ పగుళ్లుతేలి కూలిపోయే స్థితికి చేరుకుందని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట సత్యం, వహీద్ హుస్సేన్, తిరుపతి, భిక్షపతి, నర్సింహ ఉన్నారు.

అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యత

గోవిందరావుపేట, ఫిబ్రవరి19 : అడవులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పస్రా రేంజ్ అధికారి మాధవిశీతల్ అన్నారు. అడవుల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై బుధవారం కర్లపల్లి, మొద్దులగూడెం, గాంధీనగర్, లక్ష్మీపురం, మొద్దులగూడెం గ్రామాల్లో గొర్రెలకాపర్లు, గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. అడవుల్లో మంటలు పెట్టడం వలన వన్య ప్రాణులకు, మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు సుజాత, అజ్మత్, కల్యాణి, శారద, రాజయ్య, అపర్ణ, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- మహా శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ రాహుల్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 19: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో తాగునీరు, నిరంతరాయంగా విద్యుత్, మహాశివరాత్రి వేడుకలపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మంచినీటి సరఫరా పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. గ్రామ, పట్టణాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సమస్య వస్తే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన 1912కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలన్నారు.

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

ఈ నెల 26న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయంలో జరిగే మహా శివరాత్రి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రమైన తాగునీటి సరఫరా, వైద్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పండుగ రోజుల్లో 48గంటలు మద్యం విక్రయాలు నిలిపి వేయాలన్నారు. తాత్కాలిక. మరుగుదొడ్లు, భక్తులు బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని అన్నారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. అనంతరం మహా శివరాత్రి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, విద్యుత్‌శాఖ సీఈ మల్చూర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీపీవో నారాయణరావు, అన్ని మండలాల ఎంపీడీవోలు, విద్యుత్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు, మత్స్యశాఖ అధికారి అవినాష్, దేవస్థానం ఈవో మహేశ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి..

రేగొండ : గ్రామీణప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో డీఆర్డీఏ, కృషివిజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో ఉన్నతి ప్రాజెక్టుకింద పాడి పరిశ్రమ, వర్మీకంపోస్టు, ఆక్వాకల్చరుపై మహిళా స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాహుల్‌శర్మ హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక అభివృద్ధి చెందడానికి డీఆర్డీఏ రుణాలు అందిస్తున్నదన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమపాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో నరేశ్, వరంగల్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త సాయికిరణ్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్వేత, డీపీఏలు రవి, నారాయణ, ఏపీవోలు అలీం, జావిద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ములుగురూరల్, ఫిబ్రవరి 19 : ములుగు జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో పలు ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో రెండు దఫాలుగా 1427మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి సమస్య ఉన్న వారి కోసం అద్దాలను ఆర్డర్ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, వైద్యులు రణధీర్, శ్రీకాంత్, నరహరి, శ్రీనివాస్, మల్లిఖార్జున్, శ్రీలత, జయప్రద, సుజాత, స్వప్న, వెంకటేశ్, ప్రత్యూష, ఆఫ్తాల్మాలజిస్ట్ ఆఫీసర్ తిరుపతి, గోపాల్‌రెడ్డి, ఫార్మాసిస్టు, సిబ్బంది ఉన్నారు.

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయాలి..

ఈ నెల 20వ తేదీ నుంచి మార్చి 31వరకు అసంక్రమిత వ్యాధులైన మధుమేహం, హైపర్ టెన్షన్, క్యాన్సర్ నిర్ధారణకు 30ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు చేయాలని డీఎంహచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు వైద్యులను ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లతోపాటు ఎన్‌హెచ్‌ఎం జిల్లా డాటా మేనేజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు 76శాతం స్క్రీనింగ్ చేశామని, మిగిలిన 24శాతం లక్ష్యాన్ని ప్రత్యేకమైన డ్రైవ్‌తో పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఆరోగ్య మందిర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో

వెంకటాపూర్ : మండలంలోని జవహర్‌నగర్ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డీఎంహెచ్‌వో గోపాల్‌రావు బుధవారం సందర్శించారు. ఆరోగ్య మందిర్‌లో జరుగుతున్న జాతీయ నాణ్యత ప్రమాణాల అసైన్‌మెంట్‌ను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విపిన్‌కుమార్, డీపీవో చిరంజీవి, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, జిల్లా క్వాలిటీ మేనేజర్ శరత్, లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, డాక్టర్లు సంఘమిత్ర, చందన, పీహెచ్ఎన్ శోభ, సూపర్‌వైజర్ పుష్పకుమారి, ఆరోగ్య కార్యకర్త ఫాతిమా, ఫార్మసిస్ట్ స్వర్ణలత, వెంకట్‌రెడ్డి, హరి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై 1912ను సంప్రదించాలి

ములుగురూరల్, ఫిబ్రవరి 19 : విద్యుత్ సమస్యలపై వినియోగదారులు 1912ను సంప్రదించాలని కలెక్టర్ టీఎస్ దివాకర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24గంటలపాటు ఈ టోల్‌ఫ్రీ నంబర్ సేవలు అందిస్తుందని తెలిపారు. సరఫరా, బిల్లులు, మీటర్లు, సర్వీసుల సమస్యల పరిష్కారంతోపాటు అన్ని రకాల విద్యుత్ సమస్యలు 1912తో పరిష్కరించుకోవచ్చన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు అవగాహనసదస్సు

మంగపేట, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని రైతువేదికలో హార్టికల్చర్, కెన్ బయోసైన్స్ బృందం ఆధ్వర్యంలో బుధవారం మంగపేట రైతు వేదికలో ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హార్టికల్చర్ అధికారి కే లావణ్య మాట్లాడుతూ వేసవి సమీపించిన నేపథ్యంలో ఆయిల్‌పామ్ మొక్కలకు కావలసిన పోషకాలు, సాగు నీరు అందించాలన్నారు. ఏరియా ఇన్‌చార్జి శివకృష్ణ మాట్లాడుతూ మండలంలో పామాయిల్ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. త్వరలో ములుగు జిల్లాలోనే ఫ్యాక్టరీ ఏర్పాటు కానున్నట్లు వివరించారు. ఏఈవో గాయత్రి, కంపెనీ ప్రతినిధులు సాంబశివరావు, అఖిల్ రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి19 : మండలంలోని రాచపల్లి, మొట్లగూడెం గ్రామాల్లో రైతులు నష్టపోయిన మొక్కజొన్న పంటను మాజీ సర్పంచ్ కొర్స నర్సింహమూర్తి బుధవారం పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని అన్నారు. విత్తన కంపెనీల ఏజెంట్ల మాటలు నమ్మి రైతులు పూర్తిగా నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వాజేడు మండలంలోని అరుగుంటపల్లి గ్రామంలో నష్టపోయిన రైతుల మొక్కజొన్న పంటలను సైతం సందర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు కుంజ మహేశ్, పాయం రాంబాబు, ప్రవీణ్, పర్శిక సురేశ్, రైతులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 19 : మండలంలోని ప్రాజెక్టునగర్‌లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ హాజరై మోటార్ వెహికిల్ చట్టం, విద్యా హక్కు, బాల్య వివాహ నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్‌కుమార్, హెచ్‌ఎం చేరాలు, ఉపాధ్యాయులు పద్మావతి, సరస్వతి, స్వరూప పాల్గొన్నారు.

స్థాయిని మించి మాట్లాడొద్దు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి

టేకుమట్ల, ఫిబ్రవరి 19 : పంట పొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో కెనాల్ ద్వారా చలివాగు, మానేరు వాగులోకి నీరు విడుదల చే యాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఎండిన వాగు, చెక్ డ్యామ్ ని పరిశీలించి రైతుల పక్షాన మాట్లాడితే, నీరు విడుదల చేయకుండా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గండ్ర దంపతులపై స్థాయిని మించి మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మా ట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగు, తాగునీరు, విద్యుత్ కోసం ప్రజలు, రైతులు ఏనాడూ ఎదురు చూడలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు విడుదల చేయకుండా ఇబ్బందులు పెడుతున్నదన్నారు ప్రజలు, రైతులు బీఆర్ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఇప్పటికే తేడా గమనించారన్నారు. ఇసుక అక్రమ రవాణాతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు దోపిడీకి తెరలేపి సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుకదోపిడీ నివారించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆకునూ రి తిరుపతి, కార్మికశాఖ మండల అధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణగౌడ్, వైస్ ఎంపీపీ పోతనవేణి ఐలయ్య, మండల నాయకులు వరదాచారి, బండెల నరేశ్, పింగిళి వెంకటేశ్వర్‌రెడ్డి, ఆది రఘు, ఉడ్డమారి మహేశ్, పొన్నం చంద్రయ్య, టౌన్ అధ్యక్షుడు నిమ్మల స్వామి, గువ్వాడి లక్ష్మణ్, ఎండీ అఫ్జల్, యువజన నాయకులు ఎండీ అక్రమ్, రెడ్డి రాజుల రాజు, బోనాల సతీశ్, గొల్లపల్లి రఘు, నరేశ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

మంగపేట, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యమకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటినా ఇచ్చిన హామీలకు అతీగతి లేకుండా పోయిందని వారు బుధవారం పోస్టు కార్డుల ద్వారా నిరసన తెలిపారు. వారికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని పోస్టు కార్డుల్లో రాసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు గాదె శ్రీనివాసచారి, జిల్లా ఉపాధ్యక్షుడు కుంట ఏడుకొండలు, కోరం సంతోష్, గూడా వాసుదేవ మూర్తి, లొడంగి లింగయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, రాజయ్య, లోడే కృష్ణ, ఎస్కే అఫ్జల్ హుస్సేన్, మురళీ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగురూరల్, ఫిబ్రవరి 19 : అధికారులు సమన్వయంతో మహా శివరాత్రి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఎం సంపత్‌రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మహా శివరాత్రి జాతర సందర్భంగా డీఎస్పీ రవీందర్, ఆర్డీవో వెంకటేశ్, రామప్ప దేవాలయ ఈవో, ఆయా శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. రామప్పలో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, దేవాలయం వద్ద వసతి, ప్రత్యేక బస్సులు, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కింగ్ స్థలాలను సైతం ఏర్పాటు చేశామన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను అధికారులు వెంటనే పూడ్చివేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చలివేంద్రాలు, నీడ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మహిళలకు అవగాహన సదస్సు

చిట్యాల, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని మహిళా సబ్‌సెంటర్‌లో జిల్లా సంక్షేమ మహిళా సాధికారత అధికారి చిన్నయ్య ఆదేశాల మేరకు చిట్యాల హెల్త్ సబ్‌సెంటర్ మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది అనూష, మమత, బుధవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సాధికారత ఇన్‌చార్జి డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ విద్యార్థులకు ఆడపిల్లల విద్య, సేఫ్ టచ్–అన్ సేఫ్ టచ్, అక్రమ రవాణా, బాల్య వివాహ నిషేధ చట్టం, మొబైల్ వాడటం వల్ల జరిగే నష్టాలపై వివరించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ మమత, అకౌంట్ అసిస్టెంట్ సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కాటారం : గంగారంలో ఛత్రపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగురూరల్/ఏటూరునాగారం/మంగపేట/కాటారం/టేకుమట్ల/మహాదేవపూర్(కాళేశ్వరం)/ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. మల్లంపల్లి మండల పరిధిలోని మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆరె కులస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుడుతల రమేశ్, సూరపు యువరాజు, తిప్పారాపు కిషన్‌రావు, ఇరువల యుగేందర్, వజ్జిరి చందు, బాసిడి తిరుపతి, సురవు రాజన్న, వజ్జిరి నాగరాజు, నేపాల్ పాల్గొన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు వెంకట య్య, నవీన్, జ్యోతి, ఫాతిమా, రమేశ్, జీవవేణి, సంపత్, మున్నీ, శేఖర్, అభిలాష్ పాల్గొన్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు రాజశేఖర్, రాజేశ్, రాము, దిలీప్, రంజిత్, శివశంకర్, అఖిల్, మహేశ్, సునీల్, వంశీ పాల్గొన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో శివాజీ విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు. మంగపేట మండలంలోని బోరునర్సాపురంలో జ్వాలా ట్రస్టు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు కోడెల నరేశ్, పందిరి మోహన్, మైల మల్లికార్జున్, మటం మహేశ్, శ్రీలోజు శ్రీనివాస్, నూతులకంటి కృష్ణ, భూక్యా కుమార్, ఆదినారాయణ, సతీశ్, మహేశ్, వెంకటేశ్, రవి, శ్రీను పాల్గొన్నారు. కాటారం మండలంలోని గంగారంలో శివాజీ జయంతిని గ్రామ యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. యూత్ సభ్యులు జిల్లెల్ల ఓదెలు, నీలాల వరుణ్, లావుడ్యా వినోద్, శివాజీ, సురేశ్, సంతు, రాజ్‌కుమార్, గణేశ్, రంజిత్ పాల్గొన్నారు. టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్(టీ), ఆరెపల్లి గ్రామ ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గునిగంటి మహేందర్‌గౌడ్, ఆరె సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షులు కిష్టరావు, గువ్వాడి సంజీవరావు, విశ్వహిందు పరిషత్ మండల అధ్యక్షుడు కదం రాజేశ్వర్‌రావు, బుచ్చన్న, మహేందర్, నాగేందర్, రాంబాబు, లక్ష్మణ్, రామారావు, గోపాల్, శివాజీ, నాగులు, నవీన్, అనిల్, తిరుపతి, సురేశ్, ప్రశాంత్, నరేశ్, సరోత్తంరెడ్డి, రఘు, రవీందర్‌రావు పాల్గొన్నారు. మహదేవపూర్(కాళేశ్వరం) మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని కాళేశ్వరం, అంబట్‌పల్లి, సూరారం, అన్నారం గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బై క్ ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలో హిందు సంఘాల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, యువత పాల్గొన్నారు.

సామాన్యుల గుమ్మం వద్దకే న్యాయసేవలు

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 19 : సామాన్యుల గుమ్మం వద్దకే న్యాయసేవలు తీసుకెళ్లడంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని డిప్యూటీ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ కంప అక్షయ, జీ ప్రియాంక తెలిపారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లికి మొబైల్ వ్యాన్‌లో చేరుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ బృందం వార్డు ప్రజలకు న్యాయ అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో మార్చి 8న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీ

మల్హర్, ఫిబ్రవరి 19 : మండల కేంద్రమైన తాడిచర్లలో గడ్డి మందు స్ప్రే వల్ల పంట నాశనమైందని పత్రికల్లో ప్రచురితమైన కథనం మేరకు మండల వ్యవసాయాధికారి శ్రీజ బుధవారం వరి పొలాన్ని పరిశీలించారు. అలాగే స్ప్రే చేసిన గడ్డి మందును పరిశీలించారు. గడ్డి మందు విక్రయించిన సంబంధిత ఫర్టిలైజర్ షాపులో కూ డా ఏవో తనిఖీ చేశారు. బిల్ బుక్కులను పరిశీలించారు. మందు సిఫార్సు చేసిన దానికంటే ఎక్కువ మోతాదులో స్ప్రే చేస్తే పంటకి నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే పురుగు మందుల డీలర్లు రైతు కొనుగోలు చేసిన ఎరువులకు బిల్స్ ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కాటారం, ఫిబ్రవరి 19 : ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని బొప్పారం క్రాస్ వద్ద బుధవారం పట్టుకున్నట్లు కాటారం ఎస్సై అభినవ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బందితో కలిసి బొప్పారం క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ట్రాలీలో పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. సుమారు 8క్వింటాళ్ల పీడీఎస్ బియాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ రమేశ్, బియ్యాన్ని సేకరించి తరలిస్తున్న సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే కాటారంలో గుడుంబాను విక్రయిస్తున్న లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. 5లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కాటారం మండలంలోని విలాసాగర్, గంగారం గ్రామాల్లో బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను విలాసాగర్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ సందీప్, ఓనర్ శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటిని పరిశీలించిన పీడీ

రేగొండ, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను బుధవారం గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ లోకిలాల్ పరిశీలించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తుండగా పనులను పీడీ పరిశీలించి, ఏఈ రాజలింగును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వెంకటేశ్వరురావు ఉన్నారు.

దేవాదుల మరో మోటర్ ఆన్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 19 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఒక మోటర్‌తో పంపింగ్ కొనసాగుతుండగా బుధవారం మరో మోటర్‌ను ఆన్ చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఫేస్ 2,3నుంచి ఒక్కో మోటర్ ఆన్ చేశారు. రెండు మోటర్ల ద్వారా రోజుకు 583క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు డీఈ, ఏఈ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 19 : మండల కేంద్రానికి చెందిన ఎద్దు శివ రమేశ్‌కు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. టాటా మ్యాజిక్ డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై భార్య రాజేశ్వరితో గొడవ పెట్టుకోవడంతో మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన రమేశ్ గత ఏడాది డిసెంబర్ 22వ తేదీన గడ్డి మందు తాగాడు. అప్పటి నుంచి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హైనా కలకలం

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 19 : మండలంలో హైనా సంచారం బుధవారం కలకలం రేపింది. మరికాల పంచాయతీ బుడిబాక గ్రామ సమీపంలో మొక్కజొన్న చేనును కోతుల బెడద నుంచి కాపాడుకునేందుకు పూనెం సుక్రు అనే రైతు పెంపుడు కుక్కను పొలం వద్ద కట్టివేసి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన అనంతరం పొలం వద్దకు వెళ్లి చూడగా కుక్క చనిపోయి కనిపించింది. చుట్టు పక్కల ఉన్న పాద ముద్రలను చూసి పెద్ద పులి అని భయాందోళన చెంది గ్రామానికి వచ్చి విషయాన్ని తెలిపాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు బుధవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి పాదముద్రలు హైనావిగా గుర్తించినట్లు తెలిపారు.

సైబర్ క్రైమ్ కేసు నమోదు

రేగొండ, ఫిబ్రవరి 19 : రేగొండ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పోలు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు.. నారాయణపురం గ్రామానికి చెందిన తిరుపతికి జనవరి 24న గుర్తుతెలియని వ్యక్తి 6268040772 నంబరు నుంచి ఫోన్ చేశాడు. ఎస్‌బీఐ నుంచి ఫోన్ చేస్తున్నామని, క్రెడిట్ కార్డు కావాలా..? అని అడిగాడు. ఓకేచెప్పడంతో వాట్సప్ లింక్ పంపి ఓటీపీ చెప్పమని అడుగగా ఓటీపీ చెప్పడంతో తిరుపతి అకౌంటు నుంచి రూ.12,048 ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత?

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని పోతుగల్ వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లతోపాటు, డోజర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. బుధవారం చిట్యాల మండలం నవాబుపేటకు చెందిన ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు వాగు వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుకతో ఉన్న రెండు ట్రాక్టర్లతోపాటు, డోజర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

పోలీస్ రికార్డులను తనిఖీ చేయడం అవాస్తవం

వెంకటాపూర్, ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం తహసీల్దార్ గిరిబాబు సందర్శించిన సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారనేది అవాస్తవమని డీఎస్పీ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్‌రికార్డులు తనిఖీ చేసే అధికారం కేవలం పోలీస్ ఉన్నత అధికారులకు మాత్రమే ఉంటుందని, ఏ ఇతర శాఖలకు లేదని డీఎస్పీ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఏఎస్పీ

వే బ్రిడ్జి వద్ద ఇసుక లారీల తనిఖీ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 19 : నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ హెచ్చరించారు. బుధవారం రాత్రి మండలంలోని చిన్నబోయినపల్లి వే బ్రిడ్జి వద్ద ఇసుక లారీలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఓవర్ లోడ్లు ఏమైనా ఉన్నాయా..? అని పరిశీలించారు. వే బిల్లులు, తప్పుడు రవాణా పత్రాలు కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వే బ్రిడ్జి వద్ద ఎక్కువ లోడుతో ఉన్న ఇసుక లారీల బరువును తక్కువగా చూపిస్తూ బిల్లులు ఇచ్చినట్లు వెల్లడైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నకిలీ వే బిల్లులు డబుల్ ట్రిప్‌లు ఉండకూడదన్నారు. నదులు, వాగుల్లో తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, ఏటూరునాగారం, మంగపేట ఎస్సైలు తాజుద్దీన్, టీవీఆర్ సూరి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, రాత్రి వే బ్రిడ్జి వద్ద తహసీల్దార్ జగదీశ్వర్ తనిఖీ చేపట్టారు. రవాణా అవుతున్న లారీల వివరాలు, వాటి తూకం వివరాలను సేకరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

★I, MUNDADA TARA (New Name) previously called TARAKUMARI MUNDADA (Old Name), W/o SRINIVAS MUNDADA R/o H.No: 8-4-90, Sri Krishna Colony, Station Road, Warangal district,-506002, TG Solemnly declare.

NTW-17491

CHANGE OF NAME

★I, GADE PADMA (Old Name) H.No. 35-6-312, Vivek Nagar Colony, Gopalpur, Hanumakonda City & Dist-506009, T.G., Have changed my name from GADE PADMA to GODE PADMA (New Name) W/o RACHARLA GANAPATHI for all Purposes.

NTW-6556

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.

NTW-326545

CHANGE OF NAME

★I, GARNEPALLI ALANA REDDY (Old Name) H-NO.2-5-259/502, PJMR Iconia Apartment, Near Kakatiya Mahila College, Nakkalagutta, Hanumakonda city & Dist-506001, T.G, have Changed my name from GARNEPALLI ALANA REDDY TO GARNEPALLI ALANA (New Name) W/o GARNEPALLI NARDEEP REDDY. for all purposes

NTW-6557

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565